క్లుప్తంగా

3 నుంచి 'భూభారతి'పై సదస్సులు

బూర్గంపాడు: భూభారతి చట్టంపై రైతులు అవగాహన కల్పించేందుకు జూన్ 3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శిరీష తెలిపారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో భూభారతి రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను ఆమె విడుదల చేశారు. జూన్ 3న నాగినేనిప్రోలు, ఇరవెండిల గ్రామాల్లో, జూన్ 4న ముసలిమడుగు, మోతె పట్టీనగర్, జూన్5న కోయగూడెం, కృష్ణసాగర్, జూన్ 6న తాళ్లగొమ్మూరు, నకిరిపేట, జూన్ 9న సారపాక, ఉప్పుసాక, జూన్ 10న సోంపల్లి, టేకుల చెరువు, జూన్ 11న లక్ష్మీపురం, మోరంపల్లిబంజర, జూన్ 12న అంజనాపురం, వేపలగడ్డ, బూర్గంపాడులలో, జూన్ 13న పినపాక పట్టీనగర్‌లలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని ఆమె వెల్లడించారు. రైతులు రెవెన్యూ సదస్సులకు తప్పకుండా హాజరై భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

నూతన 33 కేవీ లైన్ ప్రారంభం

దమ్మపేట: మండలంలోని నాచారం గ్రామంలో నూతన 33 కేవీ విద్యుత్ లైన్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేందర్ చేతులమీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. గంగారం 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి నాచారం సబ్ స్టేషన్ వరకు నూతన 33 కేకే లైన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ లైన్ కారణంగా నాచారం, నాగుపల్లి, గండుగులపల్లి సబ్ స్టేషన్‌లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ నందయ్య, ఏడీఈ వెంకటరత్నం, యాసిన్, రాజేష్, రమేష్‌బాబు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం

భద్రాచలంటౌన్: జిల్లా కుంగ్‌ఫు, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెయింట్ పాల్స్ స్కూల్‌లో నెల రోజులుగా నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్కూల్ కరస్పాండెంట్ అబ్రహం మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన 50 మంది చిన్నారులు ఈ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు బహుమతులు అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కుంపు మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదినారాయణ, కాశీ హుస్సేన్, రాజ, హరిబాబు, సాగర్, లీల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సత్కారం

మణుగూరుటౌన్: అడిషనల్(సీఎంఓ) మేరీకుమారి, పర్సనల్ విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్ గురు ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా శనివారం ఏరియా అధికారులు వేర్వేరుగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. వారు సింగరేణికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో అధికారులు, ఏరియా ఆస్పత్రి సిబ్బంది, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం పాల్గొన్నారు.

పీఓకు వినతి

భద్రాచలంటౌన్: ఏజెన్సీకి కేంద్రమైన భద్రాచలంలో న్యాయ కళాశాలను ఏర్పాటు చేసి జీఓ నం.3 బదులుగా కొత్త జీఓను తీసుకురావాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ ఎదుట శనివారం ధర్నా నిర్వహించి, పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. పూనెం సాయి, పూనెం ప్రతాప్, ప్రకాష్ దొర, గొంది లీలా, ప్రసాద్, బిరబోయిన శేఖర్, సంతోష్ కుమార్, పూనెం వరప్రసాద్, ముయ్యన్న, పాయం సన్యాసి, వాసం రామకృష్ణ దొర, ప్రశాంత్, శరత్, సాయి, శివప్రశాంత్ పాల్గొన్నారు.

ఉద్యమించాలి..

బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా హామీ అమలు కోసం ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తాళ్లగొమ్మూరు, కోయగూడెం గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనిప్రాంతాల్లోని మహిళా కూలీలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు కోసం జూన్ 6న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

న్యాయం చేయాలి..

ములకలపల్లి: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్‌రావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూపా భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కల్లూరి పద్మ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సదస్సులో పాల్గొన్న వారు మాట్లాడారు. తొలుత తహసీల్ వరకు భారీ ప్రదర్శన చేసి, ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ భూక్యా గన్యాకు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతుగంటి లక్ష్మణ్, కల్లూరి కిషోర్, నాయకులు సరోజిని, నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

వేడుకకు వేళాయే..!

- కల్యాణ వేంకటేశ్వర స్వామి నూతన దేవాలయం ముస్తాబు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- నేటి నుంచి వారం రోజుల పాటు ఉత్సవాలు


నూతనంగా నిర్మించిన ఆలయం

సండే స్పెషల్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం సీతారామనగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి దేవాలయం, ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. వేంకటేశ్వర సాయి సేవా సమితి ఆధ్వర్యంలో పాత ఆలయ స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ శంకుస్థాన చేసి పనులను పూర్తి చేశారు. కాలనీలో ఆలయాన్ని నిర్మించి దాదాపు 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఇరుకుగా ఉన్న ఆలయాన్ని దాతల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కళాకారులు ఆలయ నిర్మాణ పనులను కళాత్మకంగా నిర్మించారు. భక్తి భావం ఉట్టిపడేలా నిర్మాణ పనులను పూర్తి చేశారు.

స్వామివారి దేవాలయంతో పాటు ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమాలను జూన్ 1వ తేదీ నుంచి 6 వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం ఆలయ ఆవరణాలో వారం రోజుల పాటు నిర్వహించే తాత్కాలిక హోమ, యాగ శాలలను నిర్మించారు. శ్రీ వేంకటేశ్వర సాయి సేవా సమితి ఆధ్వర్యంలో సభ్యులు పట్టణంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని ఆలయ కమిటీ అందుకు అనుగునంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

వారం రోజుల కార్యక్రమాలు ఇవే..

- నేడు మొదటి రోజు శాలావాస్తు, వాస్తు హోమం, నూతన ప్రతిష్ఠా విగ్రహాలు, ధ్వజ స్తంభం, విమాన సుదర్శన కలశాదులతో వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తారు.
- రెండో రోజు 2వ తేదీన భగవదారాధన, సేవాకాలం, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, విష్వక్సేన పూజ, మానోన్మాన శాంతి హోమం, నిత్య పూర్ణాహుతి నివేదన, సామూహిక శ్రీవిష్ణుసహస్రనామ స్రోత్త పారాయణం నిర్వహిస్తారు.
- మూడో రోజు నిత్యప్రబోధిక కార్యక్రమం, నిత్య హోమం, విశేష హోమం, చతుస్థానార్చన, హవనాదులు, జలాధివాసము, నివేదన చేపట్టబోతున్నారు.
- నాలుగవ రోజు నిత్య ప్రాభోధిక, జలాదుత్థాపన, ఆలయవాస్తు, పర్యగ్ని కరణం, నిత్య పూర్ణాహుతి, నివేదన, మహాలక్ష్మి హోమం చేస్తారు.
- ఐదవ రోజు శ్రీసంక్షేప రామాయణం, శ్రీసుదర్శన హోమం, నిత్య పూర్ణాహుతి నిర్వహించ తలపెట్టారు.
- ఆరో రోజు శుక్రవారం ఉదయం 7.53 నిమిషాలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠతో పాటు గరుడ, ధ్వజస్తంభ, విమాన శిఖరాదుల ప్రతిష్ఠాపన, పూర్ణాభిషేకం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పండితులు నిర్వహిస్తారు.



అందరూ హాజరు కావాలి



శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామివారి దేవాలయం, ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలకు భక్తులు ప్రతి ఒక్కరు హాజరు కావాలి. స్వామివారిని కొలిచే వారికి సకల శుభాలు కలుగుతాయని ఇక్కడి భక్తులకు నమ్ముతారు. ప్రారంభోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశాం.

– కె.వెంకట పుల్లారావు, కమిటీ సభ్యుడు

దాతల సహకారం మరువలేనిది..



కల్యాణ వేంకటేశ్వర స్వామివారి దేవాలయం ఆలయ పున నిర్మాణంలో దాతల సహకారం మరువలేనిది. నిర్మాణ పనులను ప్రారంభించగానే అనేక మంది దాతలు అనేక విధాలుగా సహాయ సహకారాలను అందజేశారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– అడబాల సత్యనరేష్‌బాబు, కమిటీ సభ్యుడు

35 మంది పండితులతో పూజలు



శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి దేవాలయ, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు సీతారామచంద్ర స్వామివారి దేవస్థాన ప్రధాన అర్చకుడు పొటిశెట్టి రామచంద్రాచార్యులు అధ్వర్యంలో సుమారు 35 మంది వేద పండితులు పాల్గొంటారు. భక్తులు పాల్గొనాలని కోరుతున్నాం.

– అరుట్ల నారాయణాచార్యులు, ఆలయ అర్చకుడు

విద్యుత్ సమస్యలపై ఆరా


ఏరియా ఆస్పత్రిలో విద్యుత్ సమస్యలపై ఆరా తీస్తున్న డీఈ జీవన్ కుమార్, సిబ్బంది

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాతో పాటు మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ సప్‌లై పొజిషన్ గురించి శనివారం స్థానిక విద్యుత్ శాఖ డీఈ జీవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి జాయింట్ ఇన్స్‌పెక్షన్ చేశారు. విద్యుత్ సరఫరాలో ఎమైనా అంతరాయం ఉందా, లేక మరేమైన విద్యుత్ సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. విద్యుత్‌కు సంబంధించి ఏదైనా సమస్య వచ్చిన వెంటనే స్థానిక సిబ్బందికి తెలియజేస్తే సమస్య త్వరగా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ వేణు, భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రామకృష్ణ, ఏఈ రాజారావు, మిషన్ భగీరథ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

119 శాతం బొగ్గు ఉత్పత్తి


బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న జీఎం దుర్గం రాంచందర్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో మే నెలలో 119 శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ శనివారం తెలిపారు. జీఎం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మే నెల బొగ్గు, ఓబీ వెలికితీత లక్ష్యాల వివరాలను వెల్లడించారు. ఈ నెలలో 9.88 లక్షలకుగాను 11.74 లక్షల టన్నుల బొగ్గును ఉత్పిత్తి చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు పేర్కొన్నారు. మణుగూరు ఓసీ విస్తరణకు ప్రయత్నాలు జరగుతున్నాయని తెలిపారు. సింగరేణి మున్సిపాలిటీతో పాటు సమీప ప్రాంత అభివృద్ధికి రూ.3.11 కోట్ల మేర కలెక్టర్ జితేష్ పాటిల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. పీవీకాలనీలో చోరీల నివారణకు గతంలోనే 49 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటి పర్యవేక్షణ బాధ్యతను కూడా సింగరేణి చేపట్టనుందని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, వెంకట్రావ్, శ్రీనివాసచారి, శ్రీనివాస్, శేషగిరి, సింగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

చండ్రుగొండ: తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం శనివారం మండలంలోని సాగింది. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతవాసులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడుకోవాలన్నారు. ఈ ప్రచారయాత్ర చండ్రుగొండ, సీతాయిగూడెం, రావికంపాడు, పోకలగూడెం, అయన్నపాలెం గ్రామాల్లో సాగింది. రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, జి.గంగాధర్, బి.ఈరు, శ్రీను, మంగీలాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వితన దుకాణాల్లో తనిఖీలు


బూర్గంపాడు: విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి శంకర్

బూర్గంపాడు: వ్యవసాయ శాఖ అధికారులు శనివారం కూడా విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. మోరంపల్లి బంజరలోని విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి శంకర్ తనిఖీలు నిర్వహించారు. విత్తనాలకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకుని భద్రపరుచుకోవాలన్నారు.

పినపాక: మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో ఏఓ వెంకటేశ్వర్లతో కలిసి ఎస్సై రాజ్ కుమార్ శనివారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో లైసెన్సులు, స్టాక్ పుస్తకాలను పరిశీలించారు. ఎరువుల దుకాణాలలో నిషేధిత పురుగుమందులు, విత్తనాలు అమ్మితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

చండ్రుగొండ: నిరుద్యోగ యువతీ యువకులకు ఐటీసీ, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేట్ సెక్టార్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు రథం సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.వెంకట్రాం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వివరాలు వెల్లడిస్తూ.. యువకులకు ఎలక్ట్రీషియన్, సోలార్ రంగంలో, యువతులకు బ్యూటీపార్లర్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు సెల్ నంబర్ 9177641543కు సంప్రదించాలని ఆయన కోరారు.

పొగాకు వినియోగంతో అనర్థాలు

పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేసి పొగాకు ఉత్పత్తుల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. వైద్యుల ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించి, ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రతిజ్ఞ చేయించారు. వక్తలు మాట్లాడుతూ.. చుట్ట, బీడి, సింగరేట్ వంటి పొగాకు ఉత్పత్తులతోపాటు గంజాయి వల్ల ఎంతో మంది తమ జీవితాలను చీకటిమయం చేసుకుంటున్నారని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి


చండ్రుగొండ: ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆరోగ్య సిబ్బంది


పినపాక: పొగాకు రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యురాలు దుర్గా భవాని

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు వహించాలి

ములకలపల్లి: రైతు సోదరులు తామ పండించే పంట విత్తనాల ఎంపికల్లో జాగ్రత్తలు వహించాలని, నాణ్యమైన, ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తనాలను మాత్రమే వినియోగించాలని అశ్వారావుపేట ఏడీఏ రవికుమార్ సూచించారు. ములకలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వ్యవసాయ కళాశాలల శాస్త్రవేత్తలు డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ నీలిమ మాట్లాడుతూ.. రైతులకు పలు సూచనలు చేశారు. ఎంఏఓ అరుణ్‌బాబు, ఏఈఓలు మనోహర్, రమేశ్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): మండలంలోని పది పంచాయతీల్లో ఏడాది కాలంగా జరిగిన ఉపాధి హామి పథకం పనులపై అన్నపురెడ్డిపల్లిలో శనివారం ప్రజావేదిక నిర్వహించారు. గడిచిన ఏడాది మార్చి నెల నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నెల వరకు రూ. 6.24 కోట్ల విలువ చేసే 501 పనులు నిర్వహించారు. ఇటీవల కాలంగా పంచాయతీల్లో పనుల నిర్వహణపై సామాజిక తనిఖీలు జరిపించారు. ప్రజావేదికలో సమీక్ష అనంతరం సిబ్బందిపై రూ.57 వేలు పెనాల్టీ విధించారు. మరో రూ.16 వేలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. జిల్లా అడిషినల్ డీఆర్‌డీఓ రవి, అంబుడ్స్‌మెన్ నాగప్రకాష్, విజిలెన్స్ అధికారి రమణరావు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అనుష, నాణ్యత విభాగం అధికారి అనిత, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన స్థానిక పిట్టా వీర్రాజు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి శనివారం అందజేశారు. కార్యకర్తలకు అండగా కేసీఆర్ బీమాను సౌకర్యాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ జానీపాషా, నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాస్, తంతరపల్లి వెంకటేశ్వర్లు, మడకం భూపతి, లంక శివ, వాగే కృష్ణ, జంగిటి రాము, నిమ్మనగొట్టి రవి, అనిల్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే డీఆర్, పీఆర్‌సీ, నగదు రహిత ఈహెచ్‌ఎస్‌లతో పాటు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని భద్రాచలం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూషన్‌రావు అన్నారు. పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో జూన్ 16న రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శరత్‌బాబు, వెంకన్న, హనుమంతరావు, రామచంద్రరావు, సత్యనారాయణ, నరసిహం, తులసీదాస్, మాణిక్యకుమారి, విజయరావు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకపోతే చర్యలు


మాట్లాడుతున్న సీఐ నాగబాబు

మణుగూరురూరల్: ఆకతాయిలు, రౌడీషీటర్లు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని మణుగూరు సీఐ పాటి నాగబాబు హెచ్చరించారు. శనివారం మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆకతాయిగా ప్రవర్తించే యువకులకు, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, రాత్రి వేళల్లో బైకులపై ఇష్టానుసారంగా సంచరించినా.. మద్యం సేవించి హల్‌చల్ చేసినా, వివాదాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ


రామకృష్ణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సీహెచ్‌వీ రామకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కొద్ది రోజుల క్రితం జరిగిన బదిలీల్లో అశ్వారావుపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వనం కృష్ణప్రసాద్ సుజాతనగర్ మండలానికి అయ్యారు. ఆయన స్థానంలో వీరభద్రరావును ఉన్నతాధికారులు నియమించగా.. విధుల్లో చేరలేదు. దీంతో ఉన్నతాధికారులు అశ్వారావుపేట కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ.. ఉత్తర్వులు జారీ చేయగా, ఆయన విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరణ తర్వాత దమ్మపేట మండలం గండుగులపల్లిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు.

మంత్రిని కలిసిన తహసీల్దార్

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి నివాసంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దమ్మపేట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పూలకుండీని అందజేశారు. అనంతరం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ సభ్యులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమాల్లో కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్,వసంతరావు, యుగంధర్, మహేశ్వరరావు, వేణు, రామభద్రం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పీకేఓసీ-2లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. శనివారం ఆయన బురదమయంగా మారిన పీకేఓసీ వర్క్‌షాప్ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. 60 డంపర్ యార్డ్ వైపు వెళ్లాలంటేనే కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్లు మొత్తం బురదయంగా మారాయని, బేస్ వర్క్‌షాప్‌లోనూ అదే పరిస్థితి నెలకొందని అన్నారు.

కిట్లు పంపిణీ

చండ్రుగొండ: ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురుస్కరించుకుని మండలకేంద్రం చండ్రుగొండలోని ఆరోగ్యకేంద్రంలో వ్యాధి బాధితులకు మెడికల్ కిట్‌లను శనివారం పంపిణీ చేశారు. గ్రాన్యుల్స్ ఇండియా ఫార్మాస్యూటికల్ కంపెనీ ఉచితంగా సరఫరా చేసిన కిట్‌లను డాక్టర్ కనకం తనుజ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ పూర్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠలు


అశ్వారావుపేటరూరల్: గంగానమ్మ తల్లిని కరెన్సీ నోట్లతో అలంకరించిన భక్తులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి పంచాయతీ కొత్తూరు గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం ఏర్పాటు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి, శివలింగ విగ్రహాలతోపాటు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు సోయం వీరభద్రం హాజరు అయ్యారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పెదవాగు ప్రాజెక్టు వద్దగల శ్రీ గంగానమ్మ తల్లి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని రూ.500 కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని తొట్టిపంపు గ్రామంలో బాల పెద్దమ్మ దేవత విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణంతోపాటు ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా సాగుతున్న ఈ కార్యక్రమాలతోపాటు చివరిరోజు పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, ఆలయ నిర్మాణ వ్యయ ప్రదాత, హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారగాని శ్రీనివాసరావు కృతువులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధలో అభిషేకాలు, పూజలు జరిపించారు.

ములకలపల్లి: మండలపరిధిలోని నర్సాపురంలో విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన శనివారం జానకీ సమేత కోదండరామ స్వామి, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహాలు, పోతురాజు, బొడ్రాయిలను ప్రతిష్ఠించారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, పలువురు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్థానిక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

అనారోగ్య బాధితుడికి చేయూత

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని విఠల్‌రావునగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న మాలోత్ కృష్ణ కుటుంబానికి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడు, ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు ఏ.మంగీలాల్–అనసూర్య దంపతులు వారి కుమారుడు టాటాలాల్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం బియ్యం, నిత్యావసరాలను వితరణగా అందజేశారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగోత్ శేఖర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.